# చిత్ర విచిత్రాలు

స్వామి చిత్రానంద

ఒక నవయువ రచయిత తొలి తెలుగు చిత్రం విడుదలై ఘన విజయం సాధిస్తోంది. 'సంభాషణల్లో కొత్తదనం అక్కడక్కడ కనుపించకుండా ఉండడం లేదు.' అని కొన్ని పత్రికలు రాశాయ్. తెలుగునాడు నాలుగు మూలల్నించీ ఆ కవికి ఉత్తరాలు వస్తున్నాయ్. ఆయనను అడగని నిర్మాత లేడు. ఆయనను చూడని (మద్రాస్ వచ్చిన) తిరుపతి యాత్రికుడు లేడు.

ఒక యాత్రికుడు ఒక సుప్రభాతాన ఆయన దర్శనం కోసం ఆయన యింటికే వెళ్ళాడు. కాని-ఆయన యింట్లో లేడు!

"నాకు నా గృహమే స్వర్గసీమ" అని ఆ పత్రిక దేంట్లోనో చెప్పిన ఆయన యింట్లో లేరేమిటా అని నిరాశగా తిరిగి పోదామనుకుంటున్నప్పుడు కవిగారు కారులోంచి దిగారు.

ఇద్దరూ నమస్కరించుకున్నారు.

యాత్రికుడు తన కథను చెబుతున్నాడు. ఆ కథను సినీమా కథ చేయవచ్చా అని శ్రద్ధగా వింటూ లోపలకు తీసుకు వెళ్ళారు. యాత్రికుడు గోడలకేసి పరీక్షిస్తున్నాడు.

"ఏమిటి అలా చూస్తున్నారు?" అన్నాడు ఆ కవి.

"అబ్బే-ఏం లేదు. మీరు ఓ పత్రికలో మీ గురువుగారి గురించి చెబుతూ భగవంతుడికి నమస్కరించే ముందు నా గురుదేవులు శ్రీ కావ్యశ్రీ గారికి నమస్కరిస్తా నన్నారుగా? ఆయన ఫోటో లేదేమిటా అని చూస్తున్నాను."

"అయ్యా! నేను భగవంతుడికి నమస్కరించేముందు గదా మా గురుదేవులకు నమస్కరిస్తానన్నాను-నే నసలు భగవంతుడికే నమస్కరించను" అన్నాడు కవి.

"హారి భగవంతుడా!" అని తనలో తానే భగవంతుడికి నమస్కరించి, వెనక్కి తిరిగి కవిగారికి నమస్కరించి వెళ్ళిపోయాడు యాత్రికుడు.

* * *

ఒక వర్ధమాన నిర్మాత తానే దర్శకుడై, ఒక నవ్యపంథాలో చిత్రం ప్రారంభించాడు. హడావిడీ, ఆర్భాటమూ లేకుండా చిత్రం పూర్తిచేశాడు. ఇటీవల ఒక పాత్రికేయుడు ఆశ్చర్యపడి ఆ నిర్మాతతో గోష్ఠి జరిపాడు.

"తమ చిత్రం పేరు?"

"నాలుగైదు టయిటిల్స్ రెడీగా వున్నాయ్- న్యూమరాలజీ ప్రకారం కూడా అన్నీ బాగున్నాయ్. ఏది పెట్టాలో తేలడం లేదు."

"అలాగా-మరి తారాగణం?"

"అంతా కొత్త తారలే."

"వారి పేర్లు?"

"వాళ్ళ పేర్లు కూడా మార్చాలండీ- అవికూడా ఈ నెలలోనే డిసైడ్ చేసేస్తాను."

"అయితే, అంతా కొత్తవారలతో, కొత్తవారికోసం, కొత్తవారు నిర్మించిన కొత్త చిత్రం" అని రాస్తాను. అన్నాడు పాత్రికేయుడు.

* * *

తారాపథంలో వెలిగిపోతున్న 'కాంతిశ్రీ' తాజా వివాహంతేదీ స్థలమూ నిర్ణయమైపోయాయి. అన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి. కొన్ని పత్రికలు ప్రత్యేక సంచికలూ, మరికొన్ని అనుబంధాలూ కూడా ప్రచురించాయి.

కాని-వున్నట్టుండి ఈ వివాహం వాయిదా పడింది. కారణం ఏమిటో ఎవరికీ అంతు చిక్కడంలేదు. పాత్రికేయులే ఒక సమావేశం ఏర్పాటు చేసి, 'కాంతిశ్రీ'ని ఆ సమావేశంలో ప్రశ్నించగా, ఆమె చెప్పిన సమాధానం.

"తెగతెంపులై పోతుందనుకున్న నా విడాకుల దావా అంతు లేకుండా వాయిదా పడింది. ఒకరికి భార్యగా వుండగా మరొకర్ని వివాహం చేసుకోవడం మన పవిత్ర హిందూ సాంప్రదాయానికి విరుద్ధం. అంచేత, నా అయిదో వివాహం రద్దు అయిన వెంటనే ఆరో వివాహం చేసుకుంటాను- ఈ సందర్భంగా నన్ను అభినందిస్తూ. ఉత్తరాలు రాసిన, టెలిగ్రాంలు పంపిన అశేష ప్రేక్షకులకు నా కృతజ్ఞత. వారికి (శ్రీవారికి కాదు) కలిగిన నిరాశకు నేను క్షంతవ్యురాలను.

* * *

ఒక నటుడికి అతని వింజామరులు చేసిన సన్మానంలో గంపలకొద్దీ పువ్వులూ, బత్తాయి పళ్ళూ సమర్పించబడ్డాయి. సన్మానం పూర్తి అయిన తర్వాత వాటి నన్నింటినీ గంపల్లో జాగ్రతగా పెట్టించుకొని రైలు ఎక్కాడు నటుడి కార్యదర్శి. ఒక స్టేషన్‌లో—

"రూపాయికి నాలుగు బత్తాయిలు-రూపాయికి నాలుగు" అని అరుస్తున్న బత్తాయికాయ కాయల వర్తకుణ్ణి పిల్చి కార్యదర్శి "రూపాయికి ఆరు యిస్తావా" అని అడిగాడు.

"ఆరు ఎక్కడసార్? అయిదు చొప్పున మీరిస్తే నేను కొంటాను" అన్నాడు ఆ బేరగాడు.

"ఎన్ని కొంటావ్?"

"ఎన్నయినా సరే"

"అయితే-యిందు" అని గంపల్లోవున్న పళ్ళు అన్నీ అమ్మేసి డబ్బు తీసుకున్నాడు. ఆ డబ్బంతా నటుడి నెత్తిమీద పోశాడు- పువ్వుల్తో కలిపి.

"ఏమిటయ్యా యిదంతా?" అని ఆశ్చర్యపోయాడు నటుడు.

"వాళ్ళు చేద్దామనుకుని - చేయలేకపోయిన కనకాభిషేకం. యథాశక్తి నేను చేస్తున్నాను."

□□□